


సత్యదేవుని దర్శించుకున్న మాజీ మంత్రి వెల్లంపల్లి

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం సత్య నారాయణ స్వామిని మాజీ దేవా దాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ఆదివారం దర్శించు కున్నారు. కుటుంబ సమేతంగా రత్నగిరి కొండపైన ఆయన పూజలు చేశారు. వీరికి దేవస్థాన అధికారులు స్వాగతం పలికి స్వామివారి ప్రసాదాన్ని జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఎల్.శ్రీనివాస్ రమణ, కృష్ణ ప్రసాద్, ఎల్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


రత్నగిరి కొండపైన మంత్రి వెల్లంపల్లి


కాకినాడ జిజిహెచ్ వద్ద మందుల కోసం బారులు తీరిన రోగులు

జ్వరాల కలవరం

- ఫ్లూ, కోవిడ్ లక్షణాలతో ఆస్పత్రులకు బాధితులు
- రోజులు తరబడి వేధిస్తున్న దగ్గు, జలుబు
- భయాందోళన కలిగిస్తున్న రోగాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వాతావరణంలో మార్పులు కారణంగా అనేకమంది జ్వరాలతో తీవ్రంగా బాధపడుతున్నారు. ఉష్ణోగ్రతలో వేడి కారణంగా వచ్చే జ్వరాలు అధికమవుతు ప్రజలన కలవం పెడుతున్నాయి. రోజుల తరబడి దగ్గు, జలుబు, గొంతు నొప్పి వేది. స్తుండడంతో ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడు తున్నాయి. అవుట్ పేషెంట్లు సైతం క్రమేణా అన్నిచోట్లా పెరుగుతున్నారు.ల ఈ వేసవిలో భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కాకినాడ జిజిహెచ్ తోపాటు పిఠాపురం, పెద్దాపురం వంటి సీహెచ్ సీలు, తుని ఏరియా ఆసుపత్రులు, వివిధ ప్రాంతాల్లోనే పీహెచ్ సీలకు రోగుల తాకిడి పెరుగుతోంది. జ్వరం, జలుబుతో ఎక్కువగా వైద్యం కోసం వస్తున్నారు. వైద్యులు పరీక్షలు చేసి అందరికీ మందులు ఇస్తున్నారు. అయితే వారం,10 రోజుల వరకూ జ్వరం తగ్గడం లేదు. ఎండలు మండుతున్న వేళ ఉపశమనం కోసం అందరూ శీతల పానీయాలను సేవిస్తున్నారు. విచ్చలవిడిగా అమ్ముతున్న ఐస్ పానీయాలు, కూలింగ్ వాటర్, కూల్ డ్రిక్స్ తాగుతుండడం వల్ల దగ్గు, జలుబు వస్తున్నాయి. కొందరు ఇళ్ల వద్దే ఎండలకు భయపడి ఆసుపత్రులకు వెళ్లడం లేదు.దీంతో రోజులు తరబడి జ్వరం, జలుబుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రత ఎక్కువైనప్పుడే కొందరు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వాతావరణంలో అతి వేడి వలన అప్పుడే పుట్టిన పిల్లలందరికీ జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని పెద్దాపురం సిహెచ్‌సి ఆస్పత్రి చంటి పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ బి.విజయ శేఖర్ తెలిపారు. ఈ సమయంలో చంటి పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు ఫ్లూ లక్షణాలతో చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఐదు ఇళ్లల్లో ఒకరికి కచ్చితంగా ఈ లక్షణాలతో ఆసుపత్రులకు వెళుతున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ లక్షణాలు ఉంటే గనక వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలని డాక్టర్లు కోరుతున్నారు. వంద డిగ్రీల పైబడి జ్వరం ఉంటే వెంటనే ఆస్పత్రిలో చూపించుకోవాలి. ఎక్కువ రోజులుగా దగ్గు, కఫం పడడం, తీవ్ర గొంతు నొప్పి ఉండడం ఫ్లూ లక్షణాలుగా హెచ్చరిస్తున్నారు. ఎక్కువ కాలం జలుబు వచ్చినా. తేలిగ్గా తీసుకోవద్దని చెబుతున్నారు.జ్వరానికి తోడు శ్వాసకోశ సమస్యలు, ఆయాసం వస్తే దగ్గర్లోని వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించుకోవాల్సి ఉంది. శారీరక పరిశుభ్రత పాటించడం, సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, కాచి చల్లార్చిన నీటిని తాగటం వలన వ్యాధులకు దూరంగా ఉండొచ్చు.

మాస్కులు ధరించాలి

గత కొన్ని రోజులుగా జగ్గు, దలుబు, జ్వరంతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. అక్కడక్కడా కోవిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలి. కోవిడ్ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి సరైన వైద్య సేవలు పొందాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ప్రమాదం వచ్చే అవకాశం ఉంది.

- డాక్టర్ హేమలత దేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్, కాకినాడ

మతోన్మాద బిజెపిని గద్దె దించాలి

సిపిఐ, సిపిఎం ప్రచార భేరిలో వక్తలు

ప్రజల ప్రయోజనాలు, దేశ సంక్షేమం కోసం కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దించాలని పలువురు నాయకులు పిలుపు ఇచ్చారు. సిపిఐ, సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం జిల్లాలో ప్రచార భేరి నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్పూర్తితో మోడీని గద్దె దింపుదామని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య అన్నారు. డైరీఫారంలో నిర్వహించిన ప్రచారం భేరిలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సంఘపరివార్ ఫాసిస్టు శక్తులు మన దేశ ప్రజలను తీవ్ర కష్టాల పాలు చేస్తున్నారన్నారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీల పరం చేస్తున్నారన్నారు. జిఎస్‌టి పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రాన్ని యాచించే భిక్షగాళ్లుగా మార్చారన్నారు. సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్‌ల పేరుతో మైనారిటీలపై ముఖ్యంగా ముస్లిం మైనారిటీల జీవితాలపై వేలాడే కత్తిని ఉంచారన్నారు. గోరక్షణ పేరుతో నిత్యం మైనారిటీలను, దళితులను హత్యా కాండలకు గురి చేస్తున్నారన్నారు. రామాలయం, కాశీ, మధుర పేర్లతో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. పాకిస్థాన్ - చైనా సరిహద్దు సమస్యల పేరుతో నిత్యం ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, జి.లోవరత్నం, నాయకులు రాజు, బుజ్జి, ఎల్లమ్మ, మరియమ్మ పాల్గొన్నారు. **పెద్దాపురం** సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య పట్టణంలో సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతాలో పాల్గొన్నారు. సిరపరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రచార సభలో ఆయన మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడారు. సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సిపిఎం నాయకులు కూనిరెడ్డి అప్పన్న, దారపురెడ్డి కష్ణ, గడిగట్ల సత్తిబాబు, యాసలపు రమేష్, గరగపాటి పెంటయ్య, రొంగల వీర్రాజు, దారపురెడ్డి సత్యనారాయణ, ఆర్.సుబ్బలక్ష్మి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిఎస్.నారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పెదిరెడ్ల సత్యనారాయణ, మడకల రమణ, అర్జున్ రావు, సూరిబాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలం చేదువాడ, కాజులూరు, శీలలంక, తిప్పరాజుపాలెం గ్రామాల్లో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంచుతూ, పోస్టర్లు అతికించారు. కూడళ్లలో సమావేశాలు నిర్వహించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకి దేశ వనరులను దోచిపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వల్లు రాజబాబు, బుడితి ప్రభాకర్ రావు, జక్కి శ్రీనివాస్, దంగేటి శ్రీనివాస్, సిహెచ్.మునలయ్య, షేక్ మీరా, దడాల సూర్యనారాయణప, ముడికి నాగేశ్వరరావు, కూరాటి ప్రసాద్ పాల్గొన్నారు. **తాళ్లరేవు** ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దుప్పి అదృష్టదీపుడు, నేరేడుమిల్లి త్రిమూర్తులు, చొల్లంగి వెంకటలక్ష్మి, కట్ట శ్రీదేవి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


కాజులూరులో..



పెద్దాపురంలో...



కాకినాడలో..


తాళ్లరేవులో..

29 నుంచి భావన్నారాయణ స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఈ నెల 29 నుండి మే 6 తేదీ వరకు శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామివారి కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. స్థానిక సర్పవరంలోని అతి పురాతన భావనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం పందిరి రాట వేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వైసిపి నాయకులు పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పుల్ల చందు, వైసిపి లీడర్ పుల్ల కోటేశ్వరరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు మాట్లాడుతూ ఎంఎల్‌ఎ కన్నబాబు ఆదేశాలతో ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటాచార్యులు, కార్య నిర్వహణ అధికారి జొన్నాడ భీమశంకర్ రావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు.

కోర్టు ప్రాంగణంలో వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి కాకినాడ రూరల్

కాకినాడ కోర్టుకు వచ్చే కక్షిదారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం కషి చేస్తుందని కాకినాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముత్తింటి విశ్వేశ్వరరావు, కార్యదర్శి చెక్క శ్రీనివాస్, కోశాధికారి బహుదూర్ షా వెంకటరెడ్డి తెలిపారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడ బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడబాల ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్నప్రసాద్ అధ్యక్షత వహించగా కాకినాడ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, కార్యదర్శి చెక్కా శ్రీనివాస్, ట్రెజరర్ బహుదూర్ వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గం కాకినాడ కోర్టుకు వచ్చే కక్షిదారులకు మెరుగైన సేవలు అందించే విధంగా కషి చేయాలన్నారు. విశ్వేశ్వరరావు, శ్రీనివాసు మాట్లాడుతూ కాకినాడ కోర్టుకు వచ్చే కక్షిదారులకు మెరుగైన సౌక ర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం విశ్వేశ్వరరావు, శ్రీనివాస్, వెంకటరెడ్డిని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యనమల రామం, కె.శ్రీరామరాజు, డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ శిరీష, సత్యనారాయణ, ఎస్.శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ, ఉంగరాల వెంకటేశ్వరరావు, సత్యనారాయణచౌదరి పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జనసేన పార్టీ కృషి

ప్రజాశక్తి-జగ్గంపేట

ప్రజారోగ్య పరిరక్షణే తమ ధ్యేయమని జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌ఛార్జి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. జగ్గంపేటలోని జనసేన ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిఎస్‌ఎల్ ఆసుపత్రి వైద్య బందంతో జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు నాలుగు మండలాల నుంచి 2000 మంది చికిత్స కోసం జగ్గంపేట వచ్చినట్టు తెలిపారు. పలు వ్యాధులతో బాధ పడుతున్న వారిని జిఎస్‌ఎల్ సంబంధిత వైద్యులు పరీక్షలు నిర్వహించి మెడిసిన్ ఇచ్చారన్నారు. వైద్య శిబిరంలో పలువురికి పంటి నొప్పి పరీక్షలు నిర్వహించి ఇబ్బందిగా ఉన్నవారికి పళ్లను క్యాన్సర్‌కు సంబంధించిన ప్రత్యేక స్కానింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల జనసేన సైనికులు సేవలు అందించారు.

ఆస్తి పన్నుపై రిబేటుకు వారం గడువు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నును ఐదు శాతం రిబేటు తో చెల్లించేందుకు వారం రోజుల గడువు మాత్రమే ఉందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. ఏప్రిల్ 30వ తేదీ లోపు పన్ను చెల్లించే వారికి ఈ రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొత్తం పన్నును ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించే వారికి మాత్రమే ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. ఇప్పటికే చాలామంది పన్ను చెల్లింపు దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారన్నారు. ప్రజల సౌకర్యార్థం సెలవు రోజుల్లో కూడా పన్నులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. పన్ను చెల్లింపు దారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు కార్పొరేషన్‌లో స్పందన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా విజ్ఞప్తులు అందజేయవచ్చునని కమిషనర్ సూచించారు. న్యాయవివాదాలు, ఆర్థికపరమైన అంశాలు మినహా మిగిలిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుడిపూడి శివన్నారాయణ భారీ ర్యాలీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా కుడిపుడి శివన్నారాయణ భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన స్వగ్రామం పత్తిగొంది నుంచి జోరు వానను లెక్కచేయక వైసిపి కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత రామాలయం వద్ద శివన్నారాయణ పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దపేటలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. పి.మల్లవరం నుంచి ముమ్మిడివరం మీదుగా మహిపాల చెరువు వద్దకు బయలుదేరారు. మధ్యలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. వేలాదిమంది వెంట రాగా భారీ బైక్ ర్యాలీ జరిగింది. ప్రమాణస్వీకారం చేసిన శివన్నారయణకు బిసి సంక్షేమ శాఖ మంత్రి వేణు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ని మంత్రి వేణు ఇంటికి వెళ్లి కలిశారు. కేక్ కట్ చేసి పంచారు.



ర్యాలీలో పాల్గొన్న కుడుపూడి శివన్నారాయణ

వైసిపి హయాంలో సంక్షేమం, అభివృద్ధి శూన్యం


ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

నాలుగేళ్లుగా వైసిపి ప్రభుత్వం సంక్షేమం పేరు చెప్పి అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టిందని, సంక్షేమం ఎంతమందికి ఇస్తున్నారో కూడా స్పష్టత లేదని పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. ఆదివారం సామర్లకోట మండలం పండ్రవాడ, పనసపాడు గ్రామాల్లో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చినరాజప్ప పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు తోటకూర శ్రీనువాసు పాల్గొన్నారు.

భారీ పిడుగులతో కుండపోత వర్షం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఆదివారం వేకువజామున 5.45 నిమిషాల నుండి ఉదయం 7.30 నిమిషాల వరకూ సామర్లకోటలో భారీ వర్షం కురిసింది. వర్షం కురస్తున్నంత సేపు భారీ పిడుగుల శబ్ధాలు కొనసాగాయి. కొన్ని రోజులుగా వేసవి ఎండల తాపంతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షంతో ఒక్కసారిగా ఉపశమనం దొరికింది. ప్రజలు సేదతీరారు. మండల పరిధిలో దాళ్వా రైతులు తమ పంటలు ఎక్కడ పాడవుతాయోనని భయాందోళనలు వ్యక్తం చేశారు. సుమారు 28.2 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. పిడుగులు ఎక్కడ పడుతున్నాయోనన్న భయాందోళనలు ప్రజలు వ్యక్తం చేశారు. మరోవైపు పట్టణ, మండల పరిధిలో డ్రెయిన్‌లు పూడికలతో నిండిపోవడంతో రోడ్లుపై వర్షం నీరు మురుగునీరు కలిసి రోడ్లుపైకి వచ్చాయి. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలో ఎటువంటి పిడుగుపాటు ప్రమాదాలపై ఫిర్యాదులు ఏమీ అందలేదని డిప్యూటీ తహాశీల్దారు ఆర్.శ్రీనివాసు తెలిపారు.


తెలుకుల వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

నేడు కలెక్టరేట్‌లో స్పందన

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 24వ తేదీ సోమవారం జిల్లా స్థాయి స్పందన ప్రజా విజ్ఞాపనల స్వీకరణ కార్యక్రమం కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపరాఉ. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ అంశాన్ని గమనించాలని ఆమె కోరారు.

27న పెద్దాపురం మండల సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఎంపిడిఒ కరక హిమ మహేశ్వరి తెలిపారు. ఎంపిపి పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలోని 23 గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై చర్చ జరుగుతుందని తెలిపారు.

పండ్లు, గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

హిందువులకు, జైనులకు పవిత్రమైన రోజు అక్షయ తృతీయ అని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అక్షయ తృతీయను పురస్కరించుకుని పోతుల సూర్యనారాయణ పేదలకు గొడుగులు, మామిడి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఈ రోజున పేదలకు చేసే దానధర్మాలు చేస్తే ఎంతో పుణ్యఫలం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్ ,రవిశంకర్ పట్నాయక్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

బంగారయ్య పేటలో అన్నదానం

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని బంగారయ్యపేటలో ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భారీ సంఖ్యలో యాత్రికులు హాజరై అన్నదానం స్వీకరించారు.

కార్టూ'నిజం'



ఛార్జీల పెంపు మన బాధ్యత కద్సార్..!!

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్, సామర్లకోట రూరల్

ప్రపంచ జ్ఞానాన్ని పెంచే పుస్తక పఠనాన్ని బాల్య దశ నుంచి పిల్లల్లో అలవరచాలని గ్రంథాలయ విశ్రాంతి ఉద్యోగి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదివే అలవాటును ప్రోత్సహించడానికి పుస్తకాల ప్రాముఖ్యత గురించి ప్రజలకు మరింత అవగాహన కల్పించడానికి ఏటా ఏప్రిల్ 3న ప్రపంచ పుస్తక దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. చదివే అలవాటు జీవితంలో ఉత్తమమైన అలవాటని, మంచి పుస్తకాన్ని చదవడం ద్వారా ఇంట్లో సమయాన్ని గడపడంతోపాటు అనేక విషయాలపై జ్ఞానాన్ని పొందవచ్చని సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, కె.శ్రీరామరాజు, పార్థసారథి, ఎస్.శ్రీనగేష్, రేలంగి బాపిరాజు, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞాన ద్వారాలు అని అవి చీకటిలో దారి దీపాలు అని బాలమందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ (కృష్ణశ్రీ) అన్నారు. సామర్లకోట మండలం మాధవపట్నం జమునా నగర్‌లో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో పుస్తక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తక పఠనం గురించి వివరించారు. ఈ సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. పుస్తక సమీక్ష చేసారు. ఎంపిక చేసిన విందుభోజనం కథను నాటకీకరణ గావించి చక్కగా ప్రదర్శించారు.వక్తత్వపోటీలో గెలుపొందిన విద్యార్థులకు బాల మందిరం కన్వీనరు కృష్ణశ్రీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల మందిరం విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కుడుపూడి శివన్నారాయణ

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-కాజులూరు

అనుమానస్పదంగా మృతి చెందిన ఆర్యవటం, గొల్లపాలెం గ్రామాలకు చెందిన మహేష్, శివ కుమార్ కుటుంబాలను ఎంఎల్‌సి బొమ్మ ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ యువకుల ఒంటిపై గాయాలు ఉన్నాయని, ఈ కేసులో అనేక అనుమానాలు ఉన్నందున బాదిత కుటుంబాలు ఇది హత్యగా భావిస్తున్నందున పూర్తిస్థాయి విచారణ జరగాలన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం జరిగినా పరిస్థితులు తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని తీవ్ర పరిస్థితులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసును తొందరగా ఎంక్వయిరీ చేసి అనుమానితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఐక్యతే బిసిల మనుగడకు ముఖ్యం

ప్రజాశక్తి-కాకినాడ

బిసిల ఐక్యత జాతిమనుగడకు ఎంతో ముఖ్యమని బిసి సంక్షేమ కూటమి (జెఎసి) వ్యాఖ్యానించింది. ఎపి బిసి సంక్షేమ జెఎసి ఆధ్వర్యంలో బిసిల సాధికారత, భవిష్యత్తు కార్యాచరణపై ఆదివారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో ప్రత్యేక సమావేశం వై.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు అంగిరేకుల అదిశేషు మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు బిసిలను ఎన్నికల్లో మాత్రమే గుర్తిస్తున్నారన్నారు. బిసిల బాగోగులు పట్టించు కోవడం లేదన్నారు. బిసిలు చరిత్రలో కలిసిపోకుండా చరిత్ర సష్టించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి నేతలు డాక్టర్ బొడ్డేపల్లి రఘు, యనమల కృష్ణుడు, పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, చప్పిడి వెంకటేశ్వరరావు ప్రసంగించారు.

జలసిరితో సాగునీటి కష్టాలు చెల్లు

డ్వామా పీడీ రామ్‌గోపాల్



ముఖా ముఖి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలసిరి పథకంతో రైతులకు సాగునీటి కష్టాల నుంచి ఊరట లభించనుందని డ్వామా పీడీ రాంగోపాల్ తెలిపారు. వైఎస్ఆర్ జలకళలో భాగంగా భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న రైతుల పొలాల్లో ఉచితంగా ప్రభుత్వం ఈ పథకం ద్వారా బోర్లను వేస్తోంది. జిల్లాలో ఈ పథకం ఇప్పటికే కార్యరూపంలోకి వచ్చింది. బోర్ల డ్రిల్లింగ్ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఈ సందర్భంగా ప్రజాశక్తి డ్వామా పీడిని పలకరించింది. ఆయన తెలిపిన వివరాలు మాటల్లోనే....

జిల్లాలో ఎన్ని బోర్లు వేయాలని లక్ష్యంగా తీసుకున్నారు..

జిల్లావ్యాప్తంగా 3,125 బోర్లు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాము. బోర్లు అవసరమైన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాము. ఇప్పటివరకు ఆన్లైన్, సచివాలయాల ద్వారా 4,570 దరఖా స్తులు అందాయి. వచ్చిన వాటిలో 3,970 దరఖాస్తు లకు ఆమోదముద్ర లభించింది. ఆమోద ముద్ర వేసిన దరఖాస్తులను డ్వామా (జిల్లా నీటి యాజమాన్యం సంస్థ) ఎపిడి లాగిన్ అయింది. ఎపిడి జియాలజిస్టుల సర్వే కోసం పంపారు. 374 దరఖాస్తులను తిరస్కరించారు. మరో 336 వివిధ కారణాలతో పెండింగ్‌లో పెట్టారు. 1,628 దరఖాస్తులకు పరిపాలనా అనుమతులు లభించాయి.

ఎక్కడ పనులు ప్రారంభించారు. ఎంత ఖర్చు అవుతుంది..

జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో జలసిరి పనులను ప్రారంభించాము. అనపర్తి, జగ్గంపేట, రాజానగరం, రాజమండ్రి రూరల్, కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజక వర్గాల్లో పనులు ప్రారంభించాము. పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటి వరకూ 938 బోర్ల డ్రిల్లింగ్ పూర్తయింది. 693 బోర్ల డ్రిల్లింగ్ పురోగతిలో ఉన్నాయి. 52 బోర్లకు విద్యుత్ సదుపాయం కల్పించాము. 40 బోర్లకు మోటార్లు సైతం అమర్చాము. మిగిలిన వాటికి త్వరితగతిన పూర్తి చేసేందుకు కషి చేస్తున్నాము. ఒక్కో బోరుకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. మరింత మంది రైతులకు మేలు చేయాలన్న సంకల్పంతో వైఎస్సార్ జలకళ అమలులో ప్రభుత్వం ఉచితంగా బోర్లు వేసి రైతులకు సాగునీరు అందిస్తోంది.

ఈ పథకానికి ఎవరు అర్హులు.. నిబంధనలు ఏమిటి..

తొలుత ఐదెకరాల్లోపు మెట్ట, రెండున్నర ఎకరాల్లోపు మాగాణి ఉన్న చిన్న, సన్న కారు రైతులకే బోర్లు వేయాలని నిర్ణయం తీసుకున్నారు. సాగు విస్తీర్ణంతో సంబంధం లేకుండా వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతూ అర్హుడేనని తేల్చి చెప్పింది. సన్న, చిన్నకారు రైతులతో పాటు మధ్యతరగతి, పెద్ద రైతులకు సైతం లబ్ధి చేకూర్చాలని మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న ప్రతి రైతు పొలంలో ఉచితంగా బోరు వేసి సాగునీటికి భరోసా కల్పించాలని పథకంలో మార్పు చేసింది. చిన్న, సన్న కారు రైతులకు బోరుతో పాటు ఉచితంగా మోటారు కూడా అందజేయనున్నాము.

దరఖాస్తులు ఎలా చేసుకోవాలి..

సచివాలయాలలో వాలంటీర్ ద్వారా బోరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి, విఆర్ఒ దరఖాస్తును పరిశీలించి డ్వామా విభాగానికి పంపిస్తారు. హైడ్రో జియలాజికల్, జియో ఫిజికల్ సర్వే ద్వారా రైతుల భూమిలో ఎక్కడ వేయాలని శాస్త్రీయంగా నిర్ధారిస్తారు. ఈ సర్వే ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. ఒక వేళ బోరు వేసిన చోట నీరు పడకపోతే మరో చోట గుర్తించి బోరు వేస్తాము. అప్పటికే బోరు ఉన్న భూమిలో బోరు వేసేందుకు అవకాశం లేదు. రైతు భూమిలో బోరు ఉండి మరమ్మతులకు గురైతే మరో బోరువేస్తాము. ఎంత మేరకు బోరు తవ్వితే ఆ మేరకు కేసింగ్ పైపు కూడా ఉచితంగా అందజేస్తాం.

రైతులు బోర్లు వేసుకోవాలంటే ఎంత ఖర్చు అవుతుంది..

బోరు వేసుకోవాలంటే రూ. లక్ష ఖర్చు చేయాల్సి వస్తుంది. రెవెన్యూ, భూగర్భ జలశాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. రూ.లక్షల్లో ఖర్చు పెట్టినా కొన్నిసార్లు ఫెయిలవడం సాధారణంగా జరుగుతుంటుంది. దీంతో రైతులు ఆర్థికంగానూ, మానసికంగానూ ఇబ్బందులు ఎదుర్కొనేవారు. జియాలజిస్ట్ ఖర్చులు భరించలేక అవస్థలు పడేవారు. ఈ సమస్యలకు చెక్ పెడుతూ వైఎస్సార్ జలకళ పథకానికి శ్రీకారం చుట్టింది. ఎక్కడ బోరు చేసేది శాస్త్రీయంగా నిర్ణయించి బోర్లు అందుబాటులోకి తెస్తోంది.

నేరాలు ఘోరాలు

పురుగు మందు తాగిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పెరవలి

పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఖండవల్లి గ్రామానికి చెందిన ఆకుల సూర్యనారాయణ (62) ఆదివారం మరణించాడు. ఆయనకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులుతణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.సూర్యభాగవాన్ తెలిపారు.

పేకాడుతున్న ఏడుగురు అరెస్టు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని జి.మేడపాడులో దండమ్మ తల్లి ఆలయం సమీపంలో పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.42,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సామర్లకోట సిఐ కె.దుర్గాప్రసాద్ ఆదివారం రాత్రి తెలిపారు.

మోదుగులమ్మ జాతర ప్రారంభం

తాళ్లపూడి : మూడు రోజులపాటు జరగనున్న తాళ్లపూడి గ్రామ దేవత మోదుగులమ్మ జాతర ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. బాణసంచా కాల్పులు, శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన పలువురు జాతరలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సర్పంచ్ నక్క వెంకటఅనురాధ, చిట్టిబాబు కుటుంబీకులు రూ.40 వేల విలువగల మంగళసూత్రాలను అమ్మవారికి అందించారు.

యానాం వార్తలు



నివాళులర్పిస్తున్న అధికారులు, కుటుంబ సభ్యులు

ఘనంగా సావిత్రి శతజయంతి

ప్రజాశక్తి - యానాం

ఫ్రెంచ్ పాలన నుంచి యానాం విముక్తి కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధురాలు, తొలి మహిళా ఎంఎల్ఎ కామిశెట్టి సావిత్రి శతజయంతి వేడుకలు సమాచార శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న ఆమె విగ్రహానికి ఆర్ఎఓ మునిస్వామి, వ్యవసాయ శాఖ అధికారి గణేషన్, ఎస్పి రఘునాయిగన్, పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు పూలమాల లేసి నివాళులర్పించారు. అనంతరం వద్ధులకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి కుటుంబ సభ్యులు సావిత్రి ఆండాల్, పైడికొండల రాజబాబు, సూర్య లక్ష్మి, వెలగ కోటీశ్వరి, చిక్కాల సావిత్రి, లక్ష్మి, సాధనాలు బాబు, చెక్కల అరుణ్ కుమార్, ఖండవల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన వాహనం

బారికేడ్లు లేక ప్రమాదాలు

ప్రజాశక్తి - యానాం

ప్రమాదమని తెలిసిన యానాం-కనకాలపేట గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ఉన్న భారీ కేడ్లు పోలీసులు తీశాసారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటిగట్టు రహదారిపై వేగంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గతంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను తిరిగి యథాస్థానంలో పెట్టాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాలపేటలో కొలువైన పోలేరమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం పోలేరమ్మ యూత్ ఆధ్వర్యంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మశ్రీ కోణంబట్ల శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన తిరణం మాచరరావు, ధరణి దంపతులచే అమ్మవారి మూలవిరాట్‌కు పంచామతాభిషేకం, సహస్ర కుంకుమార్చన చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొని పూజలు చేశారు

కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టులకు సంబంధించి ఇటీవల గ్రౌండ్ టెస్ట్‌లో ఎంపికైన కానిస్టేబుల్ అభ్యర్థులకు యానాం వద్ధాశ్రమం ద్వారా ఉచిత కోచింగ్ అందించనున్నట్లు ఓల్డ్ ఏజ్ హోమ్ వ్యవస్థాపకులు మల్లాడి కష్టారావు తెలిపారు. ఈ మేరకు ఓల్డ్ ఏజ్ హోమ్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాలుష్య కుంపటిగా డంపింగ్ యార్డ్

దుర్వాసన, పొగతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో స్థానిక కనకాల పేట ఏటిగట్టు మార్గంలో ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలు నిత్యాగ్నిహోత్రంలా మండుతూ కాలుష్య కుంపటిగా తయారయ్యింది. రహదారిపై నిత్యం ప్రయాణించే వారిపై విషపూరిత వాయువులను వెదజల్లుతోంది. ప్రజారోగ్యాలకు హానికరంగా మారిన వాయు కాలుష్యంపై స్థానికులు, రైతులు చేసిన ఫిర్యాదులపై నియంత్రణ కరువైందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు గుట్టలు, గుట్టలుగా పడి ఉన్నాయి. దీంతో కొంత కాలంగా కాలుతున్న ఈ వ్యర్థాల నుంచి దట్టమైన పొగలు వెలువడుతూ వాయు కాలుష్య ఉత్పత్తి కేంద్రంగా స్థానిక డంపింగ్ యార్డు మారింది.వాస్తవానికి ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను తడి,పొడి చెత్తగా వేరు చేయడంతోపాటు అందులోని ప్లాస్టిక్,ఇతర వ్యర్థాలను కూడా వేరు చేయాలి.ఇలా వేరు చేసిన తడి చెత్తను కంపోస్ట్ కింద మార్చాలి.కానీ స్థానికంగా ఆ పని జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.ఇక్కడి డంప్ యార్డు చెత్తలో రబ్బరు,ప్లాస్టిక్,థర్మకోల్, ఫైబర్ మొదలైన పనికిరాని వస్తువులను వేరు చేయడం లేదంటున్నారు. మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డులో చెత్త కాలుతున్న మంటలను అదుపులోకి తీసుకొని వాయు కాలుష్యం లేకుండా చూడాల్సిన అధికారులు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నామని చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల గల గ్రామాలే కాకుండా యార్డు పక్కనుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు డంపింగ్ యార్డు కాలిపోవడంతో వెలువడుతున్న దుర్వాసన పొగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. ఈ కాలుష్యం వల్ల పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలకు రోగాలు వచ్చి, ఇబ్బందులు ఎదురై, ప్రాణ నష్టం జరుగితే ఎవరు బాధ్యులని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఎప్పటికప్పుడు మంటలను అదుపు చేయాలని, నివాసాలు లేని చోటుకి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త





డంపింగ్ యార్డ్‌లో చెలరేగిన మంటలు

మహనీయుడు అంబేద్కర్ : మంత్రి వనిత

ప్రజాశక్తి- కడియం

భారతదేశానికి గొప్ప రాజ్యాంగం అందించిన మహనీయుడు అంబేద్కర్ అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. రూ.14 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనం, అంబేద్కర్ మందిరాన్ని ఎంపీ భరత్‌రామ్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫిషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్, ఆనం ఎలక్ట్రికల్స్ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డిలతో కలిసి ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడారు. తాను హోం మంత్రిగా గొప్ప స్థానంలో ఉన్నానంటే అందుకు అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమన్నారు. దళితుల కోసం చక్కని కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఆనం ఎలక్ట్రికల్స్ అధినేత ఆనం జయలక్ష్మి, ప్రేమ కుమార్ రెడ్డి దంపతులను మంత్రి అభినందించారు. ఆనం ఎలక్ట్రికల్స్ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వై.స్టాలిన్, సర్పంచ్ మార్గాని అమ్మాణి, వైసిపి నాయకులు తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, తిరుమలశెట్టి శ్రీనివాస్, ఆరేటి వెంకటరావు పాల్గొన్నారు.



ఆనం విజయకుమార్ రెడ్డి ని సత్కరిస్తున్న హోం మంత్రి వనిత , తదితరులు


ఇంటి నిర్మాణాల వేగవంతానికి పిలుపు

ప్రజాశక్తి - పెరవలి

ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. ఆదివారం పెరవలి మండలం ముక్కామలలో నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం లబ్ధిదారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందించి లేవుట్లలో స్థలాలను అప్పగించామన్నారు. నిర్మాణాల కోసం నిర్మాణ సమాగ్రి ఇతర ఆర్థిక సాయం అందించామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవాలన్నారు. సొంతింటి కల నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపిపి కె.సీతారాంప్రసాద్, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు గండేపల్లి రామకృష్ణ, సొసైటీ చైర్మన్ రేలంగి ఏసు, వైసిపి మండల అధ్యక్షులు వీరమళ్ల సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేసిన ఎంఎల్ఎ జి.శ్రీనివాస నాయుడు

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి ఆధ్వర్యంలో ఘనంగా నారా చంద్రబాబు 73వ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. కోటిపల్లి బస్టాండ్ వద్ద నున్న ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ హాజరయ్యారు. తొలుత గోరంట్ల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వారికి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు నాయుడు గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వికలాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. 100 మంది ఆటో కార్మికులకు లుంగీలు, టవల్స్ అందించారు. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి సత్య ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశీ నవీన్ కుమార్,రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు మార్గాన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. క్వారీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి భవాని, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీడీపీ బీసీ సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు సమకూర్చిన సుమారు 250 చీరలను పేదలకు పంపిణీ చేశారు.



ట్రై సైకిళ్లు అందజేస్తున్న రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని వేగేశ్వరపురం కెఎస్ఆర్ జడ్‌పిహెచ్ పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1979వ సంవత్సరంలో పదోతరగతి విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. తాళ్లపూడిలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. 40 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు.

అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీ సీజ్

ప్రజాశక్తి - గోపాలపురం

ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారంగా మట్టిని తరలిస్తున్న లారీని సీజ్ చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో భీముడు చెరువు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారకంగా టిప్పర్ పై మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. శనివారం గోపాలపురం చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా దీన్ని గుర్తించామన్నారు. అనుమతులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశామని తెలిపారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



సీజ్‌చేసిన లారీ

నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని నిర్వహించనున్నామని ఎంపిపి కె.సీతారాంప్రసాద్, ఎంపిడిఓ సింగంశెట్టి రమేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పనితీరు ఆధారంగా ఇచ్చే మండల స్థాయి ఉత్తమ పంచాయతీ పురస్కారం-2023కి మండలంలో 9 పంచాయతీలు ఎంపికయ్యాయని అన్నారు. ఎంపికైన అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కాకరపర్రు, కానూరు, తీపర్రు, ఊసులుమర్రు, కొత్తపల్లి అగ్రహారం, కాపవరం, నడుపల్లి పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు ఈ అవార్డులు అందిస్తామని అన్నారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా గురుకులం ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేవ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపల్ తాళ్లూరి ఉమాదేవి తెలిపారు. జిల్లాలో 5 గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈ పరీక్షలు జరిగాయన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 341 మందికి 300 మంది, ఇంటర్‌లో ప్రవేశాలకు 347 మందికి 320 మంది పరీక్ష రాశారని తెలిపారు.

మహారాజశ్రీ 2వ అడిషినల్ జిల్లా జడ్జి వారి కోర్టు :: అమలాపురం

I.A.No.1262/22, I.A.No.1263/22
I.A.No.1264/22, O.S.No.60/2014

Between:

Sayed Nizamohardeen, S/o. Sayed Moulani, Muslim, aged 48 Years, Kothapeta. ***...Petitioner***

AND

Geddam Hemalatha (Died) and Others ***...Respondents***

R-4: Geddam Sony Hepsibah, W/o. Late John Victior, Christian, aged Years, Business, Kothapeta.

...4th Respondent

పై నెంబరు పిటీషనులో 4వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున **ది.08-05-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

కె.ఎన్.సర్వేశ్వరరావు
కె.జగదీష్ కుమార్
అడ్వకేట్స్, అమలాపురం.

అమలాపురం,
23-4-2023.